సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం। 28। జూలై। 2025



పంటలపై పందుల దాడి

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలపై అడవి పందులు గుంపుగా వచ్చి దాడి చేస్తున్నాయి. రైతులు రాత్రిపూట పంటల వద్ద కాపలా ఉండాల్సి వస్తోంది. 8లో



టమాట కిలో రూ.37

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.37 పలికింది. కనిష్టం రూ.24, సరాసరి రూ.30 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.2°/21.5°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ వద్ద ఆందోళనలపై నిషేధం



పుట్టపర్తి టౌన్: కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు నిషిద్ధమని ఎస్పీ రత్న స్పష్టం చేశారు. ఇక నుంచి ఆందోళనలు ఆర్డీఓ కార్యాలయాల వద్ద మాత్రమే చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్ సమీపంలో సత్యసాయి విద్యాసంస్థలు, కళాశాలలు ఉండడంతో పాటు సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో ఆందోళనల కారణంగా ఇబ్బందులు తలెత్తరాదని ఈ మార్గంలో నిషేధాజ్ఞలు విధించినట్లు వెల్లడించారు. ప్రతి సోమవారం సమస్యలు విన్నవించుకొనేందుకు కలెక్టరేట్‌కు వస్తుంటారని, ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందు కోసం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రాంతంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజాసంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు గమనించి సహకరించాలని కోరారు. అలా కాదని 30 యాక్ట్ అమలులో ఉండే కలెక్టరేట్ వద్ద ధర్నాలకు దిగితే శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారవుతారని హెచ్చరించారు. ఇప్పటికీ కొందరు చలో కలెక్టరేట్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని, పోలీసుల అనుమతులు కోరి తిరస్కరణకు గురయ్యారని పేర్కొన్నారు.



మహిళల భద్రత గాలికి

- **ఉ**ద్యోగం కావాలంటే తనకు 'కమిట్‌మెంట్' ఇవ్వాలని టీడీపీకి చెందిన ఓ కార్యకర్త ఫోన్‌లో ఓ మహిళతో మాట్లాడిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నిందితుడు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పక్కనే ఉన్న ఫొటోలను కూడా అప్‌లోడ్ చేశారు. దీనిపై ఆ పార్టీ అధిష్టానం నుంచి ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. అయితే ఆడియో వైరల్ చేసిన వారిపై చర్యలు తీసుకున్నారు.
- **బ**డి నుంచి ఇంటికొచ్చిన బాలికను తనకు సమీప బంధువైన ఓ వ్యక్తి మద్యం మత్తులో చాక్లెట్ కొనిస్తానని నమ్మబలికి బలత్కారం చేయబోయాడు. సదరు బాలిక గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు గమనించారు. అప్పటికే నిందితుడు పరారయ్యాడు. పోలీసులకు చెప్పినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఈ ఘటన పుట్టపర్తి మండలంలో మూడు నెలల క్రితం జరిగింది. టీడీపీకి చెందిన వారు కావడంతో కేసు నమోదు కాకుండా చేసినట్టు సమాచారం.

కూటమి ప్రభుత్వానికి కాలం చెల్లింది



ఇంటి నుంచి బయటికెళ్లిన వారు సురక్షితంగా ఇంటికి చేరుకుంటారనే నమ్మకం పోయింది. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైంది. వరుస ఘటనలు కలకలం రేపుతున్నాయి. నియంత్రించాల్సిన వ్యవస్థ స్పందించకపోవడం అనుమానం కలుగుతోంది. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ స్వేచ్ఛగా విధులు నిర్వర్తించడం లేదని తెలుస్తోంది. మహిళలు, చిన్నారుల భద్రతను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి కాలం చెల్లింది. ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

కూటమి ప్రభుత్వంలో వేధింపుల పర్వం

- సీట్లు, ఉద్యోగాల పేరిట లోబర్చుకునేందుకు యత్నం
- వీడియోలు, బెదిరింపులతో సామూహిక అత్యాచారం
- గంజాయి మత్తులో ఇళ్లలో దూరి మహిళలపై అఘాయిత్యం
- బాలికల నుంచి వృద్ధుల వరకు ఎవరినీ వదలని 'తమ్ముళ్లు'

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ఏ క్షణం ఎక్కడ ఎలాంటి అఘాయిత్యం చూడాల్సి వస్తుందోనని భయం భయంగా గడుపుతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లొంగదీసుకునేయత్నం చేస్తున్నారు. దారినపోయే వారిని వేధిస్తున్నారు. బస్సులు, రైళ్లలో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. వీడియోలు ఉన్నాయని భయపెడుతూ బెదిరింపులకు దిగి.. లొంగదీసుకుంటున్నారు. మద్యం, గంజాయి మత్తులో ఇళ్లలోకి చొరబడి మహిళలను చెరుపుతున్నారు. జిల్లాలో ఓ ఘటన మరిచేలోపు మరో ఘటన వెలుగు చూస్తోంది. పాఠశాలకు వెళ్దామంటే.. తరగతుల్లో సీట్లు ఇప్పిస్తామంటూ.. నమ్మబలికి లోబర్చుకునేయత్నం చేస్తున్నారు. ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి.. గెస్ట్ హౌస్‌లకు పిలుస్తున్నారు. డబ్బు ఎర చూపి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి.. అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. అవమాన భారంతో చాలా మంది మహిళలు బయటికి చెప్పుకోలేక దుఃఖం దిగమింగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం విద్యార్థులను ఉపాధ్యాయులు వేధిస్తున్న ఘటనలు వెలుగు చూస్తుండటం దౌర్భాగ్యం.

మాయమాటలతో మభ్యపెడుతున్నారు

చిన్నారులు, మహిళలకు భద్రత లేకుండా పోయింది. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి అధికారులు అక్కడక్కడా అవగాహన కల్పిస్తున్నా.. డబ్బు మాయలో పడి.. మాయమాటలు నమ్మి చిన్నారులు మోసపోతున్నారు. అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఘటనలు ఇప్పటికే పదుల సంఖ్యలో వెలుగు చూశాయి. కొన్ని దుప్పటి పంచాయితీలతో మూసిపెట్టగా.. కొందరు పోలీస్ స్టేషన్ల మెట్లెక్కి.. నిందితులను పోలీసులకు అప్పగించారు. పాఠశాల నుంచి ఇంటికొచ్చిన పిల్లలను ఇరుగు పొరుగు వారు వేధిస్తున్నారు. మద్యం మత్తులో తెలీక చేశారని పంచాయితీలు చేస్తూ.. పోలీసులు జేబులు నింపుకొని కేసులు లేకుండా నీరుగారుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కలకలం సృష్టించిన ఘటనలు

గతేడాది విజయదశమి రోజున చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో గంజాయి మత్తులో ఆరుగురు యువకులు ఓ ఇంట్లో చొరబడి అత్తా – కోడలిపై అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులందరూ పలు కేసుల్లో ఉన్నోళ్లే. రెండు నెలల క్రితం రామగిరి మండలం పేరూరు పంచాయతీ ఏడుగుర్రాల పల్లిలో ఓ దళిత మైనర్ బాలికపై 14 మంది యువకులు వీడియోల పేరుతో బెదిరిస్తూ కొన్ని నెలల పాటు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక గర్భం దాల్చడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఈ రెండు ఘటనలు రాష్ట్రంలో కలకలం రేపాయి.

ఉపాధి పనుల పరిశీలన



సీసీ రోడ్డు వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డి

గాండ్లపెంట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్రం నుంచి వచ్చిన నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం (ఎన్‌ఎల్‌ఎంటీ) సభ్యుడు దయాకర్‌రెడ్డి ఆదివారం కటారుపల్లి పంచాయతీలో పర్యటించారు. గొల్లపల్లిలో రూ.57వేలతో చేపట్టిన ఫారంపాండ్, కటారుపల్లి క్రాస్ నుంచి కటారుపల్లి గొల్లపల్లి వరకు రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. గ్రామంలో పక్కాగృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం జీవనోపాధుల పథకం కింద లబ్ధి పొందిన బీబీ ఫాతిమా, బిస్మిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై సంఘాల పురోగతి, పుస్తక నిర్వహణ, కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్, ఏపీడీ రమేష్ బాబు, ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, మండల జేఈ రెడ్డి శివప్రసాద్, పలు శాఖల అధికారులు, ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'పరిష్కార వేదిక'

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ మందిరంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయవచ్చని తెలిపారు.

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీల ద్వారా తెలియజేయాలని పేర్కొన్నారు.

కుంచిటి వక్కలిగలపై నిర్లక్ష్యం

- కార్పొరేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటులో తాత్సారం
- ఏడాది దాటిపోయినా పట్టించుకోని కుటమి ప్రభుత్వం
- వైఎస్సార్ హయాంలో బీసీలుగా గుర్తింపు
- జగన్ ప్రభుత్వంలో ప్రత్యేక కార్పొరేషన్‌తో చేయూత

మడకశిర: కుంచిటి వక్కలిగల సామాజికవర్గంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే ఈ సామాజికవర్గం వారు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. వీరి జనాభా రాష్ట్రంలో 60 వేల దాకా ఉంది. అందులో ఒక్క మడకశిర నియోజకవర్గంలోనే 50 వేలమంది ఉండగా.. మిగిలిన వారు కుప్పం, పలమనేరు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం నియోజకవర్గాల్లో ఉన్నారు. తమను బీసీల జాబితాలో చేర్చాలని బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ప్రతి ఒక్కరినీ కోరుతూ వచ్చారు. ఏ ఒక్కరూ వీరిని పట్టించుకోలేదు. 2004లో 'పల్లెబాట 2.0'లో భాగంగా మడకశిర నియోజకవర్గంలో పర్యటించిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుంచిటి వక్కలిగల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వారి సాదకబాధకాలు విన్నారు. 2008లో బీసీ-బీ జాబితాలో కుంచిటి వక్కలిగలను చేరుస్తూ వైఎస్సార్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారు విద్య, ఉద్యోగ రంగాల్లో లబ్ధి పొందారు. ఆ తర్వాత వీరి గురించి ఆలోచించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కుంచిటి వక్కలిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేసి రాజకీయంగా చేయూతనందించారు. అందులోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేశారు. అత్యధికమంది నివసిస్తున్న మడకశిర నియోజకవర్గంలోని వారికే సింహభాగం పోస్టులు కేటాయించి సముచిత స్థానం కల్పించారు. కార్పొరేషన్ ద్వారానే సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకున్నారు.



మడకశిరలో దాతల సహకారంతో నిర్మిస్తున్న కుంచిటి వక్కలిగల సముదాయ భవనం

కార్యవర్గం ఏర్పాటులో జాప్యమెందుకో?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు రాజీనామా చేశారు. ఏడాది దాటినా నూతన కార్యవర్గం ఏర్పాటు కాలేదు. ఇతర కార్పొరేషన్లకు కార్యవర్గాలు వేసినా.. తమ గురించి పట్టించుకోకపోవడంపై కుంచిటి వక్కలిగలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ నూతన కార్యవర్గంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడం వారిని కలవరపెడుతోంది.

ఆ ఇద్దరినీ మరచిపోలేము



కుంచిటి వక్కలిగల గుండెల్లో ఆ ఇద్దరు నాయకులను మరచిపోలేము. వైఎస్సార్ బీసీలుగా గుర్తించి ఆదుకున్నారు. ఇక వైఎస్ జగన్ కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి మా సామాజికవర్గం వారి అభ్యున్నతికి పాటుపడ్డారు. వారిని జీవితాంతం గుర్తుంచుకుంటాం. కూటమి ప్రభుత్వం ఇంత వరకు కుంచిటి వక్కలిగల సంక్షేమం, అభ్యున్నతికి ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం బాధాకరం.

– గగన, కుంచిటి వక్కలిగల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, హేమావతి

ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలి



కుంచిటి వక్కలిగల కార్పొరేషన్ నూతన కార్యవర్గం నియమించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. నూతన కార్యవర్గం ఏర్పాటు చేసి కార్పొరేషన్ కార్యకలాపాలకు మార్గం సుగమం చేయాలి.

– వీరక్యాతప్ప, కుంచిటి వక్కలిగల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, గౌడనకుంట

నిర్లక్ష్యం చేస్తే రాజకీయ సమాధే



కుంచిటి వక్కలిగలను నిర్లక్ష్యం చేస్తే ఆ పార్టీకి రాజకీయ సమాధి ఖాయం. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించాలి. ప్రత్యేకంగా కార్పొరేషన్ నూతన కార్యవర్గంలో మడకశిర ప్రాంతీయులకు సముచిత స్థానం కల్పించాలి. సంక్షేమాన్ని విస్మరిస్తే కుంచిటి వక్కలిగలు ఎదురు తిరగడం తథ్యం.

– నాగరాజగౌడ్, కుంచిటి వక్కలిగల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, గౌడనహళ్లి

బ్రహ్మకమల వికాసం



హిందూపురం: దైవపుష్పం బ్రహ్మకమలం వికసించింది. హిందూపురంలోని ముదిరెడ్డి పల్లిలోని శివ బాలయోగినగర్ చెందిన పార్థసారథి ఇంటి ఆవరణలోని చెట్టు ఆదివారం రాత్రి ఒకేసారి 54 పుష్పాలతో వికసించి అందరినీ ఆకట్టుకుంది. ఏడాదికొకసారి పూలు పుష్పిస్తాయని ఇంటి యజమాని తెలిపారు. విషయం తెలుసుకున్న సమీపంలోని వారు తండోపతండాలుగా వచ్చి పుష్ప సోయగాన్ని తిలకించారు. శ్రావణ మాసంలో అమ్మవారికి ఇష్టమైన బ్రహ్మకమలం పుష్పాలను పూజకు వినియోగిస్తే ఎంతో శుభం కలుగుతుందని స్థానికులు పేర్కొన్నారు.

కార్లు సరే.. కంతుల్లేవ్

ఫైనాన్స్ సంస్థల్లో కలవరం

- ఉమ్మడి జిల్లాలో భారీగా డిఫాల్టర్లు
- లోను తీసుకున్న మూణ్నెళ్లకే కారు కుదువకు
- అనంతపురంలో ఈఎంఐలు కట్టని వందల కార్లు స్వాధీనం
- ఏటా ఐదువేల కార్లకు లోన్లు ఇస్తున్న బ్యాంకింగ్, ఫైనాన్స్ సంస్థలు
- ఇందులో 15 శాతం ఎన్‌పీఏలుగా ఉన్నట్లు తాజా గణాంకాల్లో వెల్లడి
- కార్లకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జల్లెడ పడుతున్న రికవరీ ఏజెంట్లు



ఉమ్మడి జిల్లాలో కార్ల లోన్ల గణాంకాలు..

లోన్లు ఇచ్చే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు	25 వరకు
ఒక్కో ఫైనాన్స్ సంస్థ ఏడాదికి లోన్లకు వ్యయం	రూ.40 కోట్లు
కార్ లోన్లకు సంస్థలు వెచ్చించే మొత్తం	రూ.800 కోట్లు
ఉమ్మడి జిల్లాలో ఏడాదికి కార్ల కొనుగోలు	6,000 వరకు
ఈఎంఐలు కట్టకపోవడంతో రికవరీకి వచ్చేవి	600 వరకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆర్థిక స్థాయిని మించి కార్లు కొనుగోలు చేసిన వందలాది మంది నెలవారీ కంతులు కట్టలేక చతికిలపడుతున్నారు. ప్రతి వంద మందిలో పది నుంచి పదిహేనుమంది డిఫాల్టర్‌గా మారుతున్న పరిస్థితి. ఈఎంఐలు సరిగా కట్టకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత ఏడాదిగా లోన్లు ఇచ్చిన బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు తలపట్టుకు కూర్చున్నాయి. ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మెన్స్ అసెట్స్) సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో బ్యాంకు సిబ్బందికి కంటిమీద కునుకులేకుండా పోతోంది. కారు తీసుకున్నప్పుడు సిబిల్ స్కోరు బాగానే ఉన్నా తర్వాత.. కంతుల చెల్లింపుల్లో దారుణంగా విఫలమవుతున్నట్టు బ్యాంకింగ్ సంస్థలు చెబుతున్నాయి.

అలా వాడి.. ఇలా కుదువకు..

కొంతమంది యువకులు కారు తీసుకుని రెండు మూడు నెలలు జల్సాగా తిరుగుతున్నారు. ఆ తర్వాత కారును తక్కువ రేటుకు ఇతరుల దగ్గర కుదువకు పెడుతున్నారు. ఆ డబ్బుతో జల్సా చేయడం, బెట్టింగ్‌లు, క్రికెట్ పందేలు ఇలా రకరకాలుగా వెచ్చించి పోగొట్టుకుంటున్నారు. రికవరీ ఏజెంట్లు కారు స్వాధీనానికి వెళ్లినప్పుడు కుదువ పెట్టుకుని డబ్బు ఇచ్చిన యజమాని అడ్డం తిరుగుతున్నారు. కొన్ని చోట్ల రాజకీయ బలాలు ఉపయోగిస్తున్నారు.

రికవరీ ఏజెంట్ల కళ్లు గప్పి..

కార్లు లేదా ద్విచక్రవాహనాలు తీసుకున్న తర్వాత వరుసగా మూడు మాసాలు ఈఎంఐలు (నెలవారీ కంతులు) చెల్లించకపోతే రెపో ఏజెంట్లు వాహనం స్వాధీనానికి వస్తారు. కానీ ఏజెంట్లు ఎంత వెతికినా కార్లు దాచేస్తున్నారు. ఏజెంట్లు వస్తున్నారన్న విషయం తెలుసుకోగానే మరోచోటుకు తెలివిగా మారుస్తున్నట్టు ఏజెంట్లు చెబుతున్నారు. ఒక్కోసారి రికవరీకి వెళ్లినప్పుడు దాడికి యత్నించిన సందర్భాలూ ఉన్నాయని ఇండస్ ఇండ్ బ్యాంకు మేనేజర్ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయ నేతలనూ ఆశ్రయిస్తున్నారు..

కంతులు చెల్లించకుండా ఉన్న కార్లను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు కొంతమంది రాజకీయ నేతలనూ ఆశ్రయిస్తున్నారు. తాజాగా ఓ వ్యక్తి కారు తీసుకుని కంతులు కట్టలేదు. దీంతో రెపో ఏజెంట్లు రికవరీ కోసం వచ్చారు. అప్పటికే సదరు కారు యజమాని బత్తలపల్లిలోని టీడీపీ నాయకుడి ఇంట్లో వాహనం పెట్టారు. అక్కడకు ఏజెంట్లు వెళ్లగా మీకు చేతనైతే తీసుకెళ్లండంటూ టీడీపీ నేత బెదిరించారు. పోలీసులు కూడా చేతులెత్తేయడంతో వెనుదిరిగారు. ఇక కోర్టుకు వెళ్లడం తప్ప చేసేదేమీ లేదని నిట్టూరుస్తున్నారు.

పంటలపై పందుల దాడి

- వందల ఎకరాల్లో దెబ్బతింటున్న పంటలు
- కాపాడుకునేందుకు అన్నదాతల అగచాట్లు

పుట్టపర్తి అర్బన్: పంటలపై అడవి పందులు దాడి చేయడంతో వందల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. అడవి పందుల దాడి నుంచి తమ పంట పొలాలను కాపాడుకోవడానికి రైతులు రాత్రి సమయాల్లో కాపు కాస్తున్నారు. అయినా అర్ధరాత్రి గుంపులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసి పోతున్నాయి. జిల్లాలో ఏటా వేల ఎకరాల్లో పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. పంట పొలాల వద్ద కాపు కాసిన రైతులపై సైతం దాడి చేసి గాయపరుస్తున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. అడవి పందులు, నెమళ్ల, జింకల బెడదతో పగలంతా వ్యవసాయంతో అలసిపోయిన రైతులకు రాత్రి పూట కంటి మీద కునుకు కూడా లేకుండా పోతోంది.

2.20 లక్షల హెక్టార్లలో పంటల సాగు..

జిల్లాలోని 32 మండలాల్లో దాదాపు 2.20 లక్షల హెక్టార్లలో పంటల సాధారణ సాగు కాగా, ప్రస్తుత ఖరీఫ్‌లో 32,333 హెక్టార్లలో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారు. మొక్కజొన్న, వేరుశనగ, కంది, పెసర, అలసంద తదితర పంటలను రైతులు ఎంతో ఖర్చు చేసి సాగు చేస్తున్నారు. బోరు బావుల కింద నీటి వసతి కలిగిన రైతులు రెండు నెలల క్రితమే వేరుశనగ, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. వీటికి ప్రస్తుతం పందులు, నెమళ్ల బెడద అధికంగా ఉంది. చాలా వరకు గ్రామాల్లో అడవి, గుట్ట ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. అర్ధరాత్రి వేళ గుంపులు, గుంపులుగా పందులు పంటలపై దాడికి పాల్పడి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటికే వందల ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న పంటలు అడవి పందులు దాడి చేయడంతో దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి పందులకు వాసన పసిగట్టే గుణం ఎక్కువగా ఉండడంతో దూరం నుంచే పంటలను గుర్తించి దాడి చేస్తున్నాయని రైతులు అంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు చేతికి వచ్చే సమయంలో మరి కొన్ని ప్రాంతాల్లో సాగు చేస్తున్న సమయంలో అడవి పందులు గుంపులుగా దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పెదపల్లిలో పందులు నష్ట పరిచిన మొక్కజొన్న పంట


పందులను బెదరగొట్టేందుకు పెదపల్లిలో రైతు ఏర్పాటు చేసిన మైక్‌లు

తీవ్ర ఇబ్బందులు



వేరుశనగ, మొక్కజొన్న పంటల్లో పందుల దాడి అధికంగా ఉంటోంది. అడవి పందులు, నెమళ్ళ, కోతులు సంతతి పెరగడంతో వాటి నుంచి పంటలను రక్షించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నాం. అడవి పందుల కోసం వేలాది రూపాయలు వెచ్చించి పాత చీరలు కొనుగోలు చేసి కడుతున్నాం. నెమళ్ల నుంచి పంట రక్షణకు కచ్చితంగా కాపలా ఉండాల్సి వస్తోంది. అవి తినేది కొంత అయితే నష్ట పరిచేది అధికంగా ఉంటుంది.

– మారుతీరెడ్డి, రైతు, వెంకటగారిపల్లి

బీడుగా వదిలేశా..



మా గ్రామం అడవికి పక్కనే ఉంది. అడవి జంతువులు నిత్యం పంటలను నాశనం చేస్తుండడంతో ఈ సారి పంటలు సాగు చేయలేక పొలాన్ని బీడుగా వదిలేశా. బోర్లలో నీళ్లు ఉన్నా పంటలను సాగు చేయలేకపోతున్నాం. ప్రకృతి వైపరీత్యాల కంటే అడవి జంతువుల నుంచి నష్టం ఎక్కువగా ఉంటోంది.

– రాజశేఖర్, రైతు, దిగువచెర్లోపల్లి

పాత చీరలు కడుతూ..

పందులను బెదరకొట్టేందుకు వరి, మొక్కజొన్న, కంది, వేరుశనగ ఇతర పంటల రక్షణకు చాలా మండలాల్లో రైతులు పాత చీరలను కట్టడంతో పాటు వాటిని బెదరగొట్టేందుకు మైక్‌లను వాడుతున్నారు. కొన్ని చోట్ల పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చుతున్నారు. విద్యుత్ తీగలతో కొన్ని ప్రాంతాలల్లో రైతులు, పశువులు, పశువల కాపరులు మృత్యువాత పడిన సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కరావులపల్లిలో వేరుశనగ పంటకు రక్షణగా కట్టిన చీరలు

క్లుప్తంగా

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు


సేకరించిన నేత్రాలను అందజేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు


షేక్ బాషా (ఫైల్)

ధర్మవరం అర్బన్: తన మరణానంతరం నేత్ర దానంతో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించారు ధర్మవరంలోని తుంపత్తి కాలనీకి చెందిన షేక్ బాషా (60). ఆదివారం అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి మోహన్, సభ్యుడు కేతా లోకేష్.. మృతుడి కుటుంబీకులను కలసి నేత్రదానం ఆవశ్యకతపై చైతన్య పరిచారు. దీంతో కుటుంబసభ్యులు అంగీకరించడంతో మృతుడి నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని భార్య షాహిదా, కుమార్తె సదాకినికు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హిందూపురం: స్థానిక సప్తగిరి లాడ్జీలో పేకాట ఆడుతున్న 24మందిని అరెస్ట్ చేసి, రూ.51,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. అందిన సమాచారం మేరకు శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో లాడ్జీలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ధర్మవరం, సోమందేపల్లికి చెందిన వారు ముదిరెడ్డిపల్లిలోని లాడ్జీలో రెండు గదులు అద్దెకు తీసుకుని పేకాట ఆడిస్తున్నట్లుగా గుర్తించారు. నగదుతో పాటు 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, జూదరులపై కేసు నమోదు చేశారు.

టీచర్ల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

- వైఎస్సార్‌టీఏ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన వేలాదిమంది టీచర్లకు రెన్నెళ్లవుతున్నా జీతాలు చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) నాయకులు వాపోయారు. ఈ మేరకు అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధానకార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ కేడర్‌స్ట్రెంత్ అప్‌డేట్ చేయకుండా అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో రాష్ట్రం రూ.1.50 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్‌తో కలసిఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రమూ చేయనన్ని అప్పులు ఆంధ్రప్రదేశ్ చేస్తోందన్నారు. అమరావతి పేరుతో రూ.31 వేలు కోట్లు అప్పు తెచ్చారన్నారు. మరో రూ.31 వేల కోట్ల అప్పు చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. చంద్రబాబు ఢిల్లీ, సింగపూర్ పర్యటనల వల్ల రాష్ట్రానికి మేలు జరగకపోగా.. అప్పుల భారం మరింత పెరుగుతోందన్నారు. 21సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లి రాష్ట్రానికి ఏమి సాధించారో చెప్పాలని సీఎం చంద్రబాబును డిమాండ్ చేశారు. పోలవరం ఎత్తు తగ్గించినా నోరుమెదపలేకపోయారని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు సహకరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూఅప్ చార్జీల పేరుతో ఆరు నెలల్లోనే రూ.15,480 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్యయాదవ్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు రాజారెడ్డి, నగర కార్యదర్శి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెలతో కలసి తండ్రి ఆత్మహత్యాయత్నం

బెళుగుప్ప: కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెందిన వ్యక్తి.. తన ఇద్దరు కుమార్తెలతో కలసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన రమేష్‌రెడ్డి, దివ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న పాటి విషయానికి ఆదివారం దంపతులు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రమేష్‌రెడ్డి.. తన ఇద్దరు కుమార్తెలను వెంటబెట్టుకుని వ్యవసాయ తోటలోకి వెళ్లి విషపు గుళికలు తాను తిని, చిన్నారులకూ తినిపించాడు. కాసేపటి తర్వాత పిల్లలను పిలుచుకుని ఇంటికి చేరుకున్నాడు. విషయాన్ని తల్లికి చిన్నారులు తెలపడంతో కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కాగా, ఆరేళ్ల వయసున్న కుముద్విని, మూడేళ్ల వయసున్న చైత్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఎంపీఆర్‌లోకి తుంగభద్ర జలాలు


మిడ్ పెన్నార్ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల వద్ద ఉన్న మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్)లోకి తుంగభద్ర జలాలు చేరుతున్నాయి. దీంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతోంది. ఆదివారం రిజర్వాయర్ ఏఈ సురేంద్ర మాట్లాడుతూ.. కణేకల్లు నుంచి మోపిడి కాలువ ద్వారా రోజూ 500 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.45 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లుగా తెలిపారు.

12వ పీఆర్సీని నియమించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: పండ్రెండవ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ను వెంటనే ఏర్పాటు చేయాలని, అలాగే మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో 'స్టడీ సర్కిల్ వర్క్‌షాపు' ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఏడాదవుతున్న వారి సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్‌లు, రిటైర్డ్ అయిన వారికి అందాల్సిన రూ. 20 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని చెబుతూనే మరోవైపు రకరకాల యాప్‌లు, వివిధ రకాల శిక్షణలు, ఇతర కార్యక్రమాలతో మానసిక క్షోభకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, నాయకులు రామప్ప, రాఘవేంద్ర, హనుమంతరెడ్డి, ప్రమీల, రవికుమార్, అబ్దుల్ వహాబ్‌ఖాన్, సంజీవకుమార్, శేఖర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురేష్‌కుమార్

ఇంజినీరింగ్‌తో బంగారు భవిష్యత్తు


సమావేశానికి హాజరైన విద్యార్థులు


సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి (చిత్రంలో) ఆలూరి సాంబశివారెడ్డి

- ఎస్ఆర్ఐటీ స్నాతకోత్సవంలో ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్‌తో బంగారు భవిష్యత్తు ఉంటుందని ఏపీ ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆచార్య డాక్టర్ హేమచంద్రారెడ్డి అన్నారు. బీకేఎస్ మండలం రోటరీపురం సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల 3వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ హేమచంద్రారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ చదవడానికి ముందు మంచి కళాశాల ఎంపిక ముఖ్యమన్నారు. నాలుగేళ్ల పాటు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే నాలుగు దశాబ్దాల పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ స్నాతకోత్సవం జరుపుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా తాను, తన భార్య జొన్నలగడ్డ పద్మావతి 2008లో ఈ కళాశాలను స్థాపించినట్లు గుర్తు చేశారు. దినదినాభివృద్ధి చెందుతూ నాణ్యతా ప్రమాణాలతో అటానమస్ హోదా దక్కించుకుందన్నారు. కళాశాలలో బీటెక్ పూర్తి చేసుకున్న 620 మందికి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వీరిలో 430 మందికి దేశంలోనే ప్రముఖ కంపెనీల్లో రూ.4 లక్షల నుంచి రూ.9లక్షల వరకు ప్యాకేజీతో ఉద్యోగాలు దక్కాయన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ(ఏ) ప్రతినిధి వేణుగోపాలరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో అనంతపురం – తాడిపత్రి రహదారిపై శనివారం అర్ధరాత్రి నడుచుకుంటూ వెళుతున్న యువకుడిని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడిని అటుగా వెళుతున్న వారు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఉదయం మృతి చెందాడు. కాగా, మరణానికి ముందు తన పేరు రవిచంద్ర అని, రాయదుర్గం పట్టణ వాసిగా ఆయన పేర్కొన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వాన కురవక.. ఆశ చావక


మొక్కలకు నీళ్లు పోస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని పెద్దవడుగూరు, లక్ష్ముంపల్లి, దిమ్మగుడి, చిన్నవడుగూరు గ్రామాల్లో చాలామంది రైతులు పత్తి, కొర్ర తదితర పంటలు సాగు చేశారు. అయితే, సరిగ్గా మొక్కలు మొలకెత్తాక వానలు కరువయ్యాయి. ఇటీవల మేఘాలు ఊరిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. దీంతో పంట ఎండుముఖం పట్టింది. వేల రూపాయలు ఖర్చు చేసి పెట్టిన పంట ఎండిపోతుండడాన్ని రైతులు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు ఎలాగైనా పంటను బతికించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. లక్ష్ముంపల్లి గ్రామానికి చెందిన రైతు ఓబుళరెడ్డి తన పొలంలోని పత్తి మొక్కలకు ద్విచక్ర వాహనంలో బిందెలతో తీసుకెళ్లిన నీటిని పోస్తూ, వాటిని బతికించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాడు.

బాలిక అదృశ్యం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని జగరాజుపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక రెండు రోజులుగా కనిపించడం లేదని పుట్టపర్తి రూరల్ పీఎస్ ఎస్ఐ లింగన్న ఆదివారం తెలిపారు. జగరాజుపల్లి గ్రామానికి చెందిన హెచ్.రవి కుమార్తె సారిక ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం నుంచి బాలిక కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ దుర్మరణం


మసీదా బేగం(ఫైల్)

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనంపై నుంచి అదుపు తప్పి కిందపడిన ఘటనలో గుమ్మఘట్ట మండల కో–ఆప్షన్ సభ్యుడు హిదతుల్లా తల్లి మసీదా బేగం (55) దుర్మరణం పాలయ్యారు. స్థానికులు తెలిపిన మేరకు.. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం తన మనవడితో కలసి ద్విచక్రవాహనంపై కణేకల్లులో ఉన్న కుమార్తెను చూసి వచ్చేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో రాయదుర్గం మండలం కదరంపల్లి వద్దకు చేరుకోగానే మసీదాబేగం చీర కొంగు వాహనం చక్కానికి చుట్టుకోవడంతో అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆ గ్రామానికి చేరుకుని మసీదా బేగం మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంత రెడ్డి, కాంట్రాక్టర్ ఆర్టీ లక్ష్మీకాంతారెడ్డి, హేమారెడ్డి, స్వామి, చమ్మా ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

ప్రకృతి సోయగాలు

ఉరవకొండ: హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలు విడుదల కావడంతో ఎంపీఆర్ లింక్ చానల్ నుంచి 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. పెన్నహోబిలం క్షేత్రం మీదుగా ఈ నీరు ఎంపీఆర్‌కు చేరుతోంది. దీంతో పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం ప్రకృతి సోయగాలతో కనువిందు చేస్తోంది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పెన్నహోబిలం క్షేత్రానికి వస్తున్న భక్తులు ఇక్కడి సెలయేళ్లలో సరదాగా గడుపుతున్నారు. వనభోజనాలతో సందడి చేస్తున్నారు.


ఉద్భవలక్ష్మి ఆలయానికి చేరువలో ఆహ్లాదాన్ని పంచుతున్న సెలయేరు


పెన్నహోబిలంలోని ఆలయం


ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఉగ్రనరసింహుడి విగ్రహం


కనువిందు చేస్తున్న జలపాతం